
ఈనాడు
పల్నాడు
మంగళవారం అక్టోబరు 15, 2024

లక్ రాజాలకే కిక్కు

లాటరీ విధానంలో ప్రైవేటు మద్యం దుకాణాల కేటాయింపు

ప్రశాంతంగా ముగిసిన ప్రక్రియ

ఈనాడు – నరసరావుపేట, డిజిటల్



జిల్లా పరిధిలోని 129 మద్యం దుకాణాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం లాటరీ విధానంలో ఎక్సైజ్ అధికారులు కేటాయించారు. ఉదయం 8 గంటలకే జిల్లా నలుమూలల నుంచి భారీసంఖ్యలో ఆశావహులు నరసరావుపేటకు చేరుకున్నారు. ప్రకాశ్‌నగర్‌లోని టౌన్‌హాల్ పరిసర ప్రాంతాలు జనాలు, వాహనాలతో రద్దీ నెలకొంది. పోలీసులు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసి దరఖాస్తు చేసిన ప్రతిఒక్కర్ని ఈ ప్రక్రియలో పాల్గొనేలా చర్యలు తీసుకోవడంతో ప్రశాంతంగా లాటరీ ప్రక్రియ ముగిసింది. లాటరీలో షాపులు దక్కించుకున్న వారు సోమవారం రాత్రికల్లా నిర్దేశిత లైసెన్సు ఫీజులో ఆరో వంతు ఫీజు చెల్లించడంతో వారి పేరుతో మంగళవారం ఉదయానికల్లా లైసెన్సులు మంజూరు చేసేలా చర్యలు వేగవంతం చేశారు.

తొలుత జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, ఎక్సైజ్‌శాఖ ఈఎస్ కె.మణికంఠ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మద్యం దుకాణాల లైసెన్స్ లాటరీ డ్రా ప్రారంభించారు. తర్వాత కార్యక్రమం మధ్యలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు హాజరయ్యారు. విడతలవారీగా దరఖాస్తుదారులను లాటరీ ప్రక్రియ లోపలకు పంపించారు. 40 దుకాణాల వరకే దరఖాస్తుదారులను టౌన్‌హాల్‌లోకి అనుమతించారు. వారివి అయిపోయాక, మిగతా 40 మందిని ఇలా.. పరిమిత సంఖ్యలో లోపలకు అనుమతించి వారి సమక్షంలో డ్రా తీశారు. దరఖాస్తుదారుల నంబర్లను ముందుగా ఒక అట్టపై వరుస సంఖ్యలో ఉంచి వాటిని జేసీకి చూపించి ఆయన అనుమతిచ్చాక, దరఖాస్తుదారులకు చూపించారు. అనంతరం వాటిని ప్లాస్టిక్ డబ్బాలో పెట్టి డ్రా తీశారు. అందరూ చూస్తుండగానే జేసీ దుకాణం సంఖ్య ప్రకారం లాటరీ తీసి, వచ్చిన నంబర్‌ను ప్రకటించారు. 129 దుకాణాలకు సంబంధించి లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.


డ్రా తీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో జేసీ సూరజ్‌గనోరే

❖ జిల్లా పరిధిలో మహిళలకు కేవలం 7 దుకాణాలు మాత్రమే వరించాయి.

✦ 65 షాపులకు దరఖాస్తులు చేసుకున్న యూపీకి చెందిన ఓ వ్యాపార గ్రూపునకు 3 షాపులు లాటరీలో వరించాయి.

✦ గుంటూరు, పల్నాడులో 165 షాపులకు దరఖాస్తు చేసుకున్న ఓ గ్రూపునకు కేవలం ఒక షాపు మాత్రమే దక్కింది.


ఉత్కంఠగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు

ఆసక్తికర విషయాలు

✦ వినుకొండ నియోజకవర్గం బొల్లాపల్లి మండలానికి చెందిన కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు 15 దుకాణాలకు దరఖాస్తు చేసుకోగా వారికి ఒక్కటంటే ఒక్క దుకాణం కూడా లాటరీ డ్రాలో దక్కలేదు. ఎంతో నిరాశతో వెనుదిరిగారు.

✦ యందర్తి శ్రీనివాసరావు అనే దరఖాస్తుదారుకు అత్యధికంగా 6 దుకాణాలను దక్కించుకున్నారు. ఆ తర్వాత నాయుడు రమేశ్ అనే దరఖాస్తుదారు మూడు దుకాణాలను దక్కించుకోవడమే కాకుండా చిలకలూరిపేట రూరల్ పరిధిలో వరుసగా 52, 53 సంఖ్య దుకాణాలను లాటరీలో దక్కించుకోవడం విశేషం. పోలినేని విజయ్‌బాబు కూడా నాదెండ్ల పరిధిలో 60, 61 దుకాణాలను వరుసగా లాటరీలో దక్కించుకున్నారు.

✦ చాలాచోట్ల ఎక్కువగా వ్యాపారులంతా ముందుగానే సిండికేట్ అయ్యారు. అంతేకాకుండా ఈనెల 13న రాత్రి పట్టణాల పరిధిలో వారంతా సమావేశమై లాటరీలో డ్రా వస్తే ఏం చేయాలి? అన్నదానిపై చర్చించుకున్నారు. మరో వైపు డ్రాలో పేరొచ్చిన వారికి భారీగా డబ్బు ముట్టచెప్పి మద్యం వ్యాపారులు దుకాణాలు దక్కించుకున్నారు.

నేటితో ముగియనున్న పాత పాలసీ

రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళవారంతో తెరపడనుంది. బుధవారం నుంచి కొత్త మద్యం పాలసీ అందుబాటులోకి రానుంది. మంగళవారం నాటికి విక్రయం కాగా మిగిలిన స్టాకు మొత్తాన్ని డిపోలకు అందజేయాలని ఇప్పటికే ప్రభుత్వ మద్యం దుకాణాలకు సమాచారమిచ్చారు. బుధవారం ఉదయం నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచార సభల్లో ఇచ్చిన హామీ మేరకు మద్యం ప్రియులు కోరుకున్న బ్రాండ్లు నాణ్యమైన మద్యం సరసమైన ధరలకు అందేలా చర్యలు తీసుకుంది.

గుంతల దారి.. గుండెలు జారి!

మాచర్ల – గుంటూరు మార్గంలో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. కొండమోడు– సత్తెనపల్లె మధ్య 27 కిలోమీటర్ల రహదారిపై అడుగడుగునా గుంతలే. అందులోనూ మోకాలు లోతు గుంతలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డెక్కితే చాలు.. ఒళ్లు.. బండ్లు గుల్లవుతున్నాయి. గమ్యం చేరాలంటే వాహనచోదకులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, రాజుపాలెం



ప్రకృతి ఒడిలో.. పంటల సాగు
వరి పొలాల్లో ఎలుకల బెడద
6లో రైతేరాజు

వినికిడి పరికరాల పరీక్షల శిబిరానికి స్పందన

నరసరావుపేట అర్బన్: పట్టణంలోని పల్నాడు రోడ్డులోని ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం నిర్వహించిన వినికిడి పరికరాల పరీక్షల శిబిరానికి స్పందన లభించిందని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి పేర్కొన్నారు. నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ డఫ్‌నెస్ కార్యక్రమంలో భాగంగా వినికిడి పరికరాలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరించారు. 98 మంది దరఖాస్తులు అందజేశారు. వారికి త్వరలోనే వినికిడి పరికరాలు అందజేస్తామని ఆయన తెలిపారు.

మిర్చి క్రయవిక్రయాలపై వర్ష ప్రభావం

గుంటూరు: మిర్చి క్రయవిక్రయాలపై వర్షం ప్రభావం చూపింది. విజయదశమి సందర్భంగా వరుసగా మూడు రోజుల పాటు యార్డుకు సెలవులు వచ్చినప్పటికీ సోమవారం తక్కువ సంఖ్యలో బస్తాలు వచ్చాయి. ఉదయం నుంచే చిరు జల్లులు పడుతుండడంతో సరకు తడుస్తుందని రైతులు శీతల గిడ్డంగుల్లో నుంచి వెలుపలకు తీసేందుకు ఆసక్తి కనబర్చలేదు. 24,413 బస్తాలు యార్డుకు తరలించారు. అందులో 21,793 బస్తాలు విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 20,808 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,500-16,000, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9,000-18,600, తాలు మిర్చికి రూ.5,000-11,500, ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,500-16,500, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.10,000-18,600 ధర లభించింది.

ఊరూవాడా పల్లె పండగ

ఒకేరోజు భారీగా అభివృద్ధి పనులకు శ్రీకారం

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గత వైకాపా ప్రభుత్వం గ్రామాలను పూర్తిగా విస్మరించింది. కేవలం సచివాలయాలను నిర్మించి అదే అభివృద్ధి అంటూ ప్రచారం చేసుకుంది. కానీ ఒక్క పైసా కూడా పంచాయతీలకు కేటాయించలేదు. ఆర్థిక సంఘ నిధులను కూడా మళ్లించి చేసి పూర్తిగా ఐదేళ్లు గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 15వ ఆర్థిక సంఘ నిధులను ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో వేయడమే కాకుండా, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. దీంతో ఏళ్లుగా పేరుకుపోయిన పలు సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి.

❖ వినుకొండ నియోజకవర్గంలో ఈపూరు మండలం బోడిచెంబునివారిపాలెంలో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

❖ నరసరావుపేట మండలం రావిపాడు, లింగంగుంట్ల, అల్లూరివారిపాలెం, ఇక్కుర్రు గ్రామాల్లో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు రూ.కోటి నలభై లక్షలతో సీసీ రోడ్లు, కాల్వలు, జల్‌జీవన్ మిషన్, ఇంకుడు గుంతల నిర్మాణానికి శిలాఫలకాలు ఆవిష్కరించారు.

❖ మాచర్ల నియోజకవర్గంలో వెల్దుర్తి మండలంలో వెల్దుర్తి, మండాది, ఉప్పలపాడు గ్రామాల్లో రూ.70 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి శంకుస్థాపన చేశారు.

❖ పెదకూరపాడులో అంబేడ్కర్ బొమ్మ సెంటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు రూ.50 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి ప్రజాప్రతినిధి భాష్యం ప్రవీణ్ శ్రీకారం చుట్టారు.


వెల్దుర్తి : అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి


మాచవరం : తురకపాలెంలో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

❖ సత్తెనపల్లి మండలంలో కంటెపూడి, కట్టావారిపాలెం గ్రామాల్లో రూ.35 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు.

❖ గురజాల నియోజకవర్గంలో మాచవరం మండలంలో తురకపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో రూ.50 లక్షలతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని, సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.

అరచేతిలో ఉపాధి పథకం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

సమగ్ర వివరాలు అందుబాటులోకి..
అవినీతి, అక్రమాలపై ఫిర్యాదుకు అవకాశం



వలసలను నిర్మూలించి ఊరిలోనే ఉపాధి కల్పనకు ఉద్దేశించిన మహాత్మాగాంధి ఉపాధి హామీ పథకాన్ని కూలీలు, సామాన్యుల అరచేతిలోకి కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. పనుల కల్పన దగ్గర్నుంచి వేతనాల చెల్లింపులు, అక్రమాలు.. ఇలా అన్ని అంశాలకు ఒకే యాప్ పని చేస్తోంది. ఇప్పటివరకు ఉపాధి కూలీలు తాము చేసిన పనులకు సంబంధించి వేతనాలు సకాలంలో రాకుంటే తపాలా కార్యాలయాలు, ఎంపీడీవోలు, డ్వామా సిబ్బంది చుట్టూ తిరిగేవారు. ఇక ఆ అవసరం లేదు. కూర్చున్నచోటు నుంచే చరవాణి ద్వారా వేతన వివరాలు తెలుసుకోవచ్చు. అవినీతి, అక్రమాలపై నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు.

జన్‌మన్ రేగా (జేఏఎన్ఎంఏఎన్ఆర్ఈజీఏ) యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కూలీల వివరాలు, హాజరు, వేతన వివరాలన్ని ఉంటాయి. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, ఉపాధి జాబ్‌కార్డు సంఖ్య నమోదు చేసి క్లిక్ చేస్తే అన్ని వివరాలు ప్రత్యక్షమవుతాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పని చేసిన రోజులు, కూలి మొత్తం, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయింది, ఎంత జమ అయిందనే వివరాలు కూడా ఉంటాయి. ఒకవేళ వేతనదారుడికి నగదు జమ కాకపోతే కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. దీంతోపాటు ఉపాధి పథకంలో చేపట్టే పనుల వివరాల సమాచారం ప్రత్యక్షమవుతుంది. ఉపాధి హాజరులో అక్రమాలకు దీనిద్వారా చెక్‌పెట్టే అవకాశం ఉంటుంది.

అక్రమాలపై సులువుగా ఫిర్యాదు..: ఉపాధి పనుల్లో అక్రమాలు, అవినీతి జరిగితే యాప్ ద్వారా కూలీలు ఫిర్యాదు చేయవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పని చేసినా.. ఉపాధి సిబ్బంది బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందిపెట్టినా ఫిర్యాదు చేసేందుకు వీలుంటుంది. ఫిర్యాదు చేసేందుకు వివరాలు అన్ని భాషల్లోనూ అందుబాటులో ఉన్నాయి. ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపకల్పన చేసింది.

❖ జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు : 3.24 లక్షలు
❖ జాబ్‌కార్డుల్లో నమోదైన కూలీలు : 5.57 లక్షలు
❖ 2023-24లో పూర్తిచేసిన పనిదినాలు : 85.37 లక్షలు
❖ 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు : 20,280
❖ ఈ ఏడాది పనిదినాల లక్ష్యం : 73 లక్షలు
❖ ఇప్పటికే పూర్తయినవి : 58 లక్షలు
❖ 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు : 1,572

విస్తృత ప్రచారం అవసరం

జన్‌మన్ రేగా యాప్‌పై అవగాహన కల్పిస్తే తమకు ఇబ్బందులుంటాయని డ్వామా సిబ్బంది భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కూలీలకు యాప్‌పై అవగాహన కల్పించట్లేదు. చాలామంది కూలీలు చరవాణి వినియోగిస్తున్నారు. వారందరూ యాప్ ద్వారా అన్నిరకాల సేవలు అందుకోవచ్చు. ప్రతి అవసరానికి ఉద్యోగులపై ఆధారపడకుండా యాప్ ద్వారా అన్ని తెలుసుకోవచ్చు. అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా పారస్పృహతో సామాజిక బాధ్యతను నెరవేర్చవచ్చు.

నరసరావుపేట బ్యాంకులో సీఐడీ విచారణ

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట): నరసరావుపేట ఐసీఐసీఐ బ్యాంకులో సీఐడీ విచారణ సోమవారం జరిగింది. అధికారులు ఖాతాదారుల వద్ద సమాచారం సేకరించారు. నరసరావుపేట 7, చిలకలూరిపేట 60, విజయవాడ ఐదుగురు మొత్తం 72 మంది ఖాతాదారుల వద్ద రూ.28 కోట్ల మోసం జరిగినట్లు సీఐడీ అడిషనల్ ఎస్పీ సీహెచ్ ఆదినారాయణ పేర్కొన్నారు. నరసరావుపేట బ్రాంచ్‌లో ఏడుగురు ఖాతాదారులను గుర్తించామని, అందులో ఐదుగురు విచారణకు హాజరైనట్లు తెలిపారు. ఇంకా ఖాతాదారులు పెరిగే అవకాశముందన్నారు. బ్యాంకు అధికారులు, ఖాతాదారుల వద్ద పూర్తి సమాచారం తీసుకుని సమగ్రంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సీఐడీ అధికారి ఆదినారాయణ తెలిపారు.

డివిజన్‌లో 176.2 మి.మీ. వర్షపాతం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : నరసరావుపేట డివిజన్‌లో సోమవారం ఉదయం నుంచి రాత్రి 7 వరకు 176.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. నరసరావుపేట 9.8 మి.మీ., రొంపిచర్ల 8.2, చిలకలూరిపేట 23.2, యడ్లపాడు 16.2, ఈపూరు 28.6, నాదెండ్ల 19.0, నూజండ్ల 26.8, శావల్యాపురం 10.6, వినుకొండ 25.4, బొల్లాపల్లి 8.4, వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది.

పులిచింతలకు 20 ఏళ్లు!



అచ్చంపేట, న్యూస్‌టుడే

కృష్ణా డెల్టా రైతుల వరప్రదాయిని కె.ఎల్.రావు సాగర్ పులిచింతల ప్రాజెక్టు పునాది రాయి వేసి 20 ఏళ్లు గడిచింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలోని 13 లక్షల ఆయకట్టు స్థిరీకరణ, తాగునీరు, విద్యుత్తు ఉత్పత్తి, చేపల పెంపకం తదితర బహుళ ప్రయోజనాలతో ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. బ్రిటిష్ కాలం నుంచి ప్రతిపాదన ఉంది. 1988 నవంబరు 19న ప్రస్తుత సూర్యాపేట జిల్లా వజినేపల్లి వద్ద అప్పటి సీఎం ఎన్టీ రామారావు పులిచింతల కర్షక జలనిధి పేరుతో శంకుస్థాపన చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. అప్పటి కాంగ్రెస్ ముఖ్య నాయకులు కొందరు, మావోయిస్టులు అడ్డుకోవడంతో అది మరుగున పడింది. 2004 అక్టోబరు 15న నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అచ్చంపేట మండలం మాదిపాడు వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి భూమిపూజ చేశారు. తొలుత రూ.681 కోట్ల అంచనాలతో నిర్మాణాన్ని గుత్తేదారు సంస్థ చేపట్టింది. 2022 మార్చి వరకు రూ.2010 కోట్లు ఖర్చు చేశారు. నాగార్జునసాగర్‌కు దిగువన 115 కిలోమీటర్లు, ప్రకాశం బ్యారేజికి ఎగువన 85 కిలోమీటర్ల దూరంలో కృష్ణానదిపై పులిచింతల ప్రాజెక్టును నిర్మించారు. 2013 డిసెంబరు 7న అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి జాతికి అంకితం చేశారు. దశాబ్దం గడిచినా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నేటికీ అందుబాటులోకి రాలేదు. గత వైకాపా ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతో పలు పనులు మందకొడిగా సాగాయి.

విశేషాలివీ..

- ప్రాజెక్టు కాంక్రీట్ కట్టడం పొడవు: **934** మీటర్లు
- మట్టి ఆనకట్ట పొడవు: **355** మీటర్లు
- రేడియల్ గేట్లు: **24**
- పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం: **45.77** టీఎంసీలు
- ముంపు గ్రామాలు: **26**
- పునరావాస కేంద్రాలు: **30**
- నిర్వాసిత కుటుంబాలు: **13,259**

❖ బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా ప్రాజెక్టుకు పునాది రాయి

❖ కానీ నేటికీ పూర్తిస్థాయిలో నెరవేరని లక్ష్యం

2014 నుంచి నీటి నిల్వ

జలాశయంలో 2014 నుంచి దశలవారీగా నీటి నిల్వ ప్రారంభించారు. 2019, 2020, 2021, 2024 సంవత్సరాల్లో ప్రాజెక్టులో పూర్తిస్థాయి 45.77 టీఎంసీల నీరు నిల్వ చేశారు. 2021 ఆగస్టు 5న ప్రాజెక్టు 16వ నంబరు గేటు విరిగి నదిలో కొట్టుకుపోయింది. 2023లో కొత్త గేటు అమర్చారు. 20 లక్షల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంలో డిజైన్ చేయగా, 2020 అక్టోబరు 10న ప్రాజెక్టు నుంచి అత్యధికంగా 8.6 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గత పదేళ్లలో నీటి ప్రవాహం ఇలా.. (టీఎంసీలలో)

సంవత్సరం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
2014–15	214.51	218.90
2015–16	24,912	27,605
2016–17	144.35	141.00
2017–18	59.87	59.99
2018–19	65.87	66.16
2019–20	961.43	957.03
2020–21	1127.88	1120.20
2021–22	574.59	554.13
2022–23	1313.64	1309.05
2023–24జూన్	562.53	551.72

చేపట్టాల్సిన పనులివే..

ప్రాజెక్టు కుడి వైపు (పల్నాడు జిల్లా) రూ.5.80 కోట్లతో 2001 జులైలో ప్రారంభించిన శాశ్వత కంట్రోల్ రూంతో పాటు కార్యాలయం, అతిథిగృహం భవన నిర్మాణం పునాది స్థాయి దాటలేదు. నిధుల కొరత కారణంగా గుత్తేదారు రెండేళ్లుగా పనులు నిలిపివేశారు. ఇంజినీర్లు, సిబ్బంది, గేట్ల నిర్వహణ పర్యవేక్షణ సిబ్బంది కూర్చొనేందుకు కూడా చోటు లేదు. రూ.67 కోట్లతో ప్రాజెక్టుకు అనుసంధానంగా పల్నాడు జిల్లా వైపు మాదిపాడు వరకు నిర్మించాల్సిన నాలుగు కిలోమీటర్ల అనుబంధ రహదారి అంచనాలకే పరిమితమైంది. ప్రాజెక్టు దిగువ భాగంలో రిటైనింగ్‌వాల్ నిర్మించారు. ఆ మధ్య ఖాళీ ప్రదేశాన్ని గ్రావెల్‌తో నింపి పార్కు.., సుందరీకరణ, పలువురి కాంస్య విగ్రహాలు ఏర్పాటు ప్రతిపాదనకే పరిమితమైంది. వాక్‌వే వంతెన నిర్మాణం ఇంకా 7 గేట్ల పరిధిలో జరగాల్సి ఉంది. రూ.7.42 కోట్ల అంచనాలతో ప్రతిపాదించిన సీసీ ఆప్రాన్ నిర్మాణం చేపట్టలేదు. ఇప్పటికీ ముంపు బాధితులకు పరిహారం చెల్లించలేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా వారి గోడు వినిపించుకొనేవారు కనిపించడం లేదు.


రిటైనింగ్ వాల్ వద్ద ప్రతిపాదిత పార్కు స్థలం

డబ్బులు వసూలు చేస్తే ఉద్యోగం పోతుంది

గ్రామ సర్వేయర్‌పై ఎమ్మెల్యే జీవీ ఆగ్రహం


సర్వేయరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ఈపూరు : మండలంలోని వనికుంటలో గ్రామ సర్వేయరు వెంకటేష్ అక్రమాలకు పాల్పడుతున్నారని, ప్రతి పనికీ డబ్బులు వసూలు చేస్తున్నారని గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే సర్వేయర్‌ను ప్రజా దర్బార్‌కు పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక మీదట ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఉద్యోగం పోయేలా చేస్తానని హెచ్చరించారు. ప్రజల వద్దకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ఈపూరులో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. భారీ సంఖ్యలో జనం వచ్చి ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. వీటి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు అందజేసి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఇనుమెళ్ల, బొమ్మరాజుపల్లి గ్రామాల్లో విలువైన ప్రభుత్వ భూముల ఆక్రమించారని, వాటిని పేదలకు పంపిణీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అర్జీలు పెట్టుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దారు నళిని, ఎంపీడీవో ప్రభాకర్‌రావు, ఎస్సై ఉమా మహేశ్వరరావు, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు పాల్గొన్నారు.

టీవీ, సినిమా అధ్యయన కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎంఏ టీవీ, సినిమా అధ్యయన కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమన్వయకర్త డాక్టర్ మధుబాబు ప్రకటనలో పేర్కొన్నారు. సినిమా రంగంపై ఆసక్తి ఉన్న అభ్యర్థులెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డాక్యుమెంటరీ, ఆర్ట్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్, క్రియేటివ్ లైటింగ్, ఎడిటింగ్, స్క్రీన్ రైటింగ్, స్టోరీ బోర్డు, సినిమాటోగ్రఫీ, ఫిలింగ్రామర్ సబ్జెక్టులను బోధిస్తామని తెలిపారు. యూజీసీ ఆదేశాల మేరకు బోధనతో పాటు 50 శాతం ప్రాక్టికల్ మార్కులుంటాయని చెప్పారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కారవేదికకు 76 అర్జీలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ప్రజలు నమ్మకంతో వచ్చి అర్జీలు ఇస్తారని.. వాటికి నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారు 76 మంది సమస్యలను అధికారులకు వివరించి పరిష్కారం చూపాలని కోరారు. డీఆర్వో వినాయకం, వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దాడులు చేసిన వారిని శిక్షించాలి

పెదకూరపాడు మండలం లగడపాడులో దళిత యువకులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ పల్లెల్లో యువకులపై దాడులు పెరిగాయని, వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా దాడులు చేశారని చెప్పారు. పోలీసులు 17 మందిపై అక్రమ కేసులు నమోదు చేశారని, నిందితులను శిక్షించి దళిత యువకులకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రగతి శీల కార్మిక సమాఖ్య, పీడీఎం నేతలు పాల్గొన్నారు.




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు, ప్రజా సంఘాల నేతలు

నాబార్డు పథకాలపై అవగాహన కల్పించాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : వ్యవసాయ రంగం అభివృద్ధికి నాబార్డు అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నాబార్డు ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాటర్‌షెడ్ నిర్మాణాలు, గిడ్డంగుల నిర్మాణం, విలేజ్ మార్కెట్లు, మైక్రో ఏటీఎం వంటి అంశాలపై నాబార్డు సహకారం అవసరమని చెప్పారు. ఆర్వోఎఫ్ఆర్ భూముల సాగుకు రుణాలు అందించే అంశంలో బ్యాంకర్ల కమిటీ సమావేశంలో విజ్ఞప్తి చేయాలన్నారు. నాబార్డు అధికారులు అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పని చేస్తే.. ఎక్కువ మంది రైతులకు, మహిళలకు (గ్రూప్పు), రాయితీ రుణాలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నాబార్డు డీడీఎం శరత్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు, జిల్లా వ్యవసాయాధికారి మురళీ, తదితరులు ఉన్నారు.

'జగన్ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం'

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: అరాచకాలు, మోసాలు, అక్రమాలే పరమావధిగా జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని మాజీమంత్రి, ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపం, వేద జూనియర్ కళాశాలలో సోమవారం పట్టభద్రుల ఎన్నికపై ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయన్నారు. విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని గంజాయివనంగా మార్చారన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తుందన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యువతకు బంగారు భవిష్యత్తు కల్పించడమే ధ్యేయంగా కూటమి పాలన సాగుతుందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న సమర్థుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. పట్టభద్రుల ఎన్నిక పరిశీలకుడు శ్రీనివాసరావు, కూటమి పార్టీ నాయకులు రామస్వామి, వందనాదేవి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్

జన సైనికుడి కుటుంబానికి న్యాయం చేయరా?

జనసేన పార్టీ నకరికల్లు మండల ప్రధాన కార్యదర్శి ఉప్పు కోటేశ్వరరావు భార్య కృష్ణవేణి ఆత్మహత్యకు కారకులైన వారిని గత 80 రోజులుగా అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, కూటమిలో జనసేన ఉన్నా జనసైనికుడి కుటుంబానికి న్యాయం జరగకపోవడం శోచనీయమని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకటసాంబశివరావు అన్నారు. కాకతీయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎన్నికల సమావేశంలో ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. దీనిపై తెదేపా నాయకులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వ్యాఖ్యలు చేయడంతో సమావేశంలో కొంత గందరగోళం నెలకొంది. కృష్ణవేణి ఆత్మహత్య కేసుపై ఎస్పీతో మాట్లాడానని, అది ప్రత్యేక కేసుగా పోలీసులు విచారణ చేస్తున్నారని ఎమ్మెల్యే కన్నా చెప్పారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు.

బాధలు ఆలకించి న్యాయం చేయండి

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావేదికను సోమవారం నిర్వహించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు.

ఇంటి స్థలం ఆక్రమిస్తున్నారు

మూడు నెలల క్రితం భర్త మృతి చెందాడు. సంజీవ్‌నగర్‌లోని నివేశ స్థలాన్ని కొంతమంది 8న ఆక్రమించేందుకు ప్రయత్నించారు. కంచె తొలగించి జేసీబీతో ఇళ్లు కూల్చే చర్య అడ్డుకున్నామని దాడి చేసి.. భయభ్రాంతులకు గురిచేశారు. **-మేళ రాజకుమారి, చిలకలూరిపేట**

ఉద్యోగం ఇప్పిస్తామని మోసగించారు

విశాఖపట్నం జిల్లా ఎస్.కోట ఎమ్మెల్యేకు వ్యక్తిగత సహాయకుడినంటూ అమర్ సర్కార్ మంత్రి ఓఎస్డీ అని శ్రీనివాసరావు, గుత్తేదారుడినంటూ హరీష్ మాయమాటలతో పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.10 లక్షలు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించకపోగా సొమ్ము తిరిగి ఇవ్వడం లేదు. **-డి.శివకుమార్, రంగారెడ్డిపాలెం, నరసరావుపేట మండలం**

కంపెనీ లేకుండా ఉద్యోగ పత్రం

ఉద్యోగం కోసం నకరికల్లుకు చెందిన మిత్రుడిని సంప్రదించాను. అతను పరిచయం చేసిన ఓ వ్యక్తికి రూ.2.30 లక్షలు చెల్లించాను. అతను ఉద్యోగ నియామక లేఖ ఇచ్చాడు. అక్కడికి వెళ్లి పరిశీలించగా.. ఆ కంపెనీ లేదు. చర్య తీసుకోవాలి. **- కాను మహేష్ వర్ధన్‌రెడ్డి, పోస్టల్ కాలనీ, నరసరావుపేట**

సొమ్ము చెల్లించని చిట్‌ఫండ్ కంపెనీ

నరసరావుపేట పట్టణంలోని ఈశ్వర్ చిట్ ఫండ్ కంపెనీకి నెలకు రూ.75 వేలు వంతున రూ.15 లక్షలు చెల్లించాను. కాలపరిమితి ముగిసి రెండేళ్లు గడిచినా సొమ్ము ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. **-మాగంటి వీరసైదులు, చింతపల్లి, కారంపూడి మండలం**

ప్రకృతి ఒడిలో.. పంటల సాగు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

చిలకలూరిపేట కూరగాయల మార్కెట్‌లో టోకు వ్యాపారం చేసే గుడిపల్లి నాగభూషణం రసాయన ఎరువులతో కాకుండా సహజ సిద్ధమైన ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయలు, పండ్లు, నూనెలు ప్రజలకు అందించాలని సంకల్పించారు. చిలకలూరిపేట మండలంలోని లింగంగుంట్ల వద్ద ఆరు ఎకరాల సాగు భూమిని కౌలుకు తీసుకుని మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.



జీవ ఎరువుల తయారీని సిబ్బందికి వివరిస్తున్న నాగభూషణం

పండిస్తున్న పంటలివే..

రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా ఆవుపేడ, గోపంచకం, నల్లబెల్లం, ఉలవపిండి, శనగలు తదితరాలతో తయారు చేసిన ద్రవ జీవామృతం మిశ్రమాన్ని ఎరువుగా ఉపయోగిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. వంకాయ, బెండ, సొర, పొట్ల, కాకర, దొండ, బీర, మునగ, పసుపు, గుమ్మడి, బూడిద గుమ్మడి, బొప్పాయి, అరటి, జామ, సీతాఫలాలు, తోటకూర, పాలకూర, మెంతుకూర, బచ్చలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా, పశుగ్రాసాలు సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయానికి ఒంగోలు జాతి, గిరి జాతి, షాహివాల, కపిల, నాటు ఆవులు, ఎద్దులు పెంచుతున్నారు. నాటుకోళ్లు, గిరిరాజా కోళ్లు, గిన్నె కోళ్లు, కడక్‌నాథ్ కోళ్లు, హంసలు, బాతులను సంరక్షిస్తున్నారు.



కూరగాయల సాగు

ప్రకృతికి మించిన దైవం లేదు

ప్రకృతి అమ్మ ఒడి లాంటిది. దానిని మరిచిపోతే మనల్ని క్షమించదు. అందుకే ప్రకృతికి మించిన దైవం లేదు. ఈ సాగు చేయడం కష్టసాధ్యమైనా ఇక్కడకు ప్రతిరోజు వచ్చి ప్రకృతి ఒడిలో సేద తీరడం, పనులు చేయడం మనసుకు ఆనందాన్ని ఇస్తుంది. దీంతో పాటు లాభాపేక్ష లేకుండా ఆరోగ్య రక్షణకు జీవ ఎరువులతో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండిస్తున్నా.

– గుడిపల్లి నాగభూషణం, ప్రకృతి వ్యవసాయదారుడు, చిలకలూరిపేట

రైతేరాజు

వరి పొలాల్లో ఎలుకల బెడద

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే : ఖరీఫ్ సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు పడటంతో పొలాల్లో తుంగ, ఊద, గరిక వంటి ఇతర కలుపు జాతి మొక్కలు బాగా పెరిగాయి. ఎలుకలు వాటి కాండాలు తొలిచి ఆహారంగా తీసుకుంటాయి. ఎలుకల నివారణకు అనుకూలమైన వాతావరణం లేక సంతతి ఎక్కువగా ఉందని వేటగాళ్లు చెబుతున్నారు. వీటి నివారణకే రూ.2 వేల నుంచి రూ.5 వేలు వెచ్చించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. మాగాణి పొలం పక్కనే మెట్ట పొలాలు, సాగు చేయకుండా వదిలిన బీడు భూములు ఉంటే ఆ పొలంలో ఎలుకల నివారణకు ఖర్చులు రూ.వేలల్లో అవుతుందని రైతులు చెబుతున్నారు. ఎలుకల దాడితో పంట దిగుబడులు తగ్గుతాయనే భయంతో ఎంత ఖర్చు అయినా ఎలుకలను పట్టించక తప్పడం లేదని మాగాణి రైతులు తెలుపుతున్నారు.



ఎలుకల బొరియలు పెడుతున్న వేటగాడు

నివారణ ఇలా.. : పొలాల్లో ఎలుకలను తేలిక పద్ధతుల్లో నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి సంధ్యారాణి అన్నారు. తొలిరోజు బొరియలను గుర్తించి మూసివేయాలి. రెండోరోజు 96 గ్రాముల నూకలను 2 గ్రాముల వంటనూనెను కలిపి 10-15 గ్రాముల చొప్పున పొట్లాలుగా కట్టి బొరియల వద్ద ఉంచాలి. ఒక రోజు ఆగి మళ్లీ 2 గ్రాముల జింక్ ఫాస్పేట్‌ను కలిపి నూకలు, నూనె మిశ్రమాన్ని తయారు చేసి ఆ పొట్లాలను బొరియల వద్ద ఉంచాలి. అవి తిన్న ఎలుకలు చనిపోతాయి. తర్వాత రోజు మళ్లీ బొరియల్లో ఎండుగడ్డి అంటించి పొగ పెట్టాలి. పది రోజులకు ఓసారి గ్రామోడయోలాన్ మందును వాడి పంట కాలువల్లో ఉండే ఎలుకలను అరికట్టవచ్చు.

జీవాల్లో మూతిపుండ్ల వ్యాధి..

నివారణ ఇలా..!

అమృతలూరు, న్యూస్‌టుడే : మూతిపుండ్ల వ్యాధి జీవాల్లో అతి వేగంగా వ్యాపించే వైరస్. దీన్ని గజ్జిమూతి వ్యాధి, కంటాజియోస్ ఎక్తిమా అని వ్యవహరిస్తారు. గొర్రెల్లో కన్నా మేకల్లో అధికంగా కనిపిస్తోంది. ఈ వ్యాధి నివారణ, జాగ్రత్తలు అమృతలూరు పశు వైద్యాధికారిణి మౌనిక వివరించారు.





మౌనిక, పశు వైద్యాధికారి

వ్యాప్తి: ఇది నేరుగా.. లేక నోటి దగ్గర పగిలిన చర్మ గాయాల ద్వారా లోనికి ప్రవేశిస్తుంది. వైరస్‌తో కలుషితమైన మేత లేదా నీటి తొట్టెల ద్వారా వ్యాపించవచ్చు. వచ్చాక 80 శాతం వరకు మందలో వ్యాప్తికి అవకాశం ఉంది.

లక్షణాలు : వైరస్ ఆశించిన మూడు నాలుగు రోజుల తర్వాత పెదవులు, మూతి చుట్టూ బుడిపెలు ఏర్పడతాయి. క్రమంగా ఇవి చీము పట్టి పగిలి గాయాల మాదిరిగా మారతాయి. ఆ ప్రాంతంలో గాయం నుంచి రక్తం కారుతుంది. రెండు నుంచి నాలుగు వారాలకు గాయాలు మాని గట్టిగా బొబ్బలా మారి రాలిపోతాయి. వీటిని చేతితో లాగరాదు.

చికిత్స : లక్షణాలు కనిపించగానే జీవాన్ని మంద నుంచి వేరు చేయాలి. తొలిరోజు నుంచి చికిత్స చేయాలి. అశ్రద్ధ వహిస్తే చిన్న పిల్లల్లో మరణాలు సంభవిస్తాయి. గాయాలను ముందుగా పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి యాంటీబయోటిక్ లేపనం పూయాలి. పశు వైద్యులతో చికిత్స అందించాలి.

నివారణ చర్యలు : ఈ వ్యాధికి వ్యాక్సిన్ మన దేశంలో అందుబాటులో లేదు. తల్లి నుంచి పిల్లలకు, పిల్లల నుంచి పాలు తాగే సమయంలో తల్లికి సోకుతుంది. కనుక పాలు కాచి చల్లార్చి సీసాతో తాగించాలి. రాలిపోయిన బొబ్బలు గమనించి షెడ్డుకు దూరంగా కాల్చి పారవేయాలి.

జున్ను పాలు.. దూడలకు మేలు

లేగ దూడల పోషణ పరంగా శ్రద్ధ తీసుకుంటే అవి సకాలంలో మంచి పాడిపశువులుగా తయారవుతాయని ప్రత్తిపాడు పశువైద్యశాల సహాయ సంచాలకులు కె. శ్రీనివాసరెడ్డి తెలిపారు. చూడి పశువులకు ఏడో నెల నుంచే అదనంగా దాణా ఇవ్వాలి. దూడల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు రోజుకు రెండు, మూడు సార్లు చొప్పున మొదటి మూడు రోజులు జున్నుపాలు తాగించాలి. పుట్టిన గంటలోపే జున్నుపాలు తాగించాలి. తాగలేని దూడలను తల్లి వద్ద నిలబెట్టి తాగేలా సహకరించాలి. లేదంటే సీసాలో పోసి పాల పీక అమర్చి తాగించాలి. జున్నుపాలలో శక్తినిచ్చే పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఎక్కువగా ఉంటాయని శ్రీనివాసరెడ్డి తెలిపారు. **- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు**

ఏపీ టెట్ పరీక్షకు 307 మంది హాజరు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : నరసరావుపేటలో నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 307 మంది హాజరైనట్లు డీఈవో ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఏఎంరెడ్డి స్మారక ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం పరీక్ష నిర్వహించారు. 360 మందికి పరీక్ష రాయాల్సి ఉండగా 53 మంది హాజరు కాలేదు. హాజరు శాతం 85.2 అని ఆయన పేర్కొన్నారు.

ఏఎస్పీ రామచంద్రరాజు సేవలు ఆదర్శనీయం

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లా పోలీసు శాఖ అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా నిర్వహించిన ఏఎస్పీ రామచంద్ర రాజు అభినందనీయుడని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ (ఏఆర్) రామచంద్ర రాజుకు వీడ్కోలు సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతిపై విజయనగర్ పీటీసీ ప్రధాన అధ్యాపకుడిగా వెళుతున్న ఆయన పోలీసులను తీర్చిదిద్దాలన్నారు. జిల్లాతో తనకున్న అనుబంధాన్ని ఏఎస్పీ వివరించారు. ఆయన్ని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైం) లక్ష్మీపతి, ఏఎస్పీ (అడ్మిన్) సంతోష్, నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, సీఐలు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు మార్చేసి.. 44 సెంట్లు కాజేసి

- వైకాపా నాయకుడి తీరుపై ఫిర్యాదు
- ప్రజాదర్బార్‌లో అర్జీల వెల్లువ



భూమి ఆక్రమించారంటూ అర్జీ ఇస్తున్న గారపాడుకు చెందిన పుల్లారావు, వెంకట్రావు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: అధికారం అండతో రెవెన్యూ అధికారులకు లంచం ఇచ్చి వైకాపా నేత, జడ్పీటీసీ సభ్యురాలి భర్త కంకణాల శివాజీ తమకు చెందిన 44 సెంట్ల భూమిని ఆక్రమించాడని గారపాడు గ్రామానికి చెందిన రాపర్ల పుల్లారావు, రాపర్ల వెంకట్రావు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు విన్నవించారు. గారపాడులో తమకు 10.42 ఎకరాలు ఉందని, అందులో 44 సెంట్లు శివాజీ పేరుతో రికార్డుల్లో నమోదు చేయించుకున్నాడని వారు పేర్కొన్నారు. పెదకూరపాడులో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. పలు గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చి సమగ్ర భూ సర్వే తప్పుల తడకగా ఉందని, కొలతల్లో వత్యాసం, భూములు ఆన్‌లైన్‌లో ఎక్కించకుండా తాత్సారం చేస్తున్నారని.. ఇలా రెవెన్యూ సమస్యలపైనే 63 మంది అర్జీలు సమర్పించారు. కొత్తగా పింఛన్లు అందించాలని 66 మంది విన్నవించారు. ప్రతి దరఖాస్తును పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తెదేపా నాయకులు రమేష్, ఎంపీపీ మీరయ్య, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దారు దానియేలు తదితరులు పాల్గొన్నారు.

వీరుల గాథలపై విద్యార్థులకు పోటీలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే దేశభక్తిని పెంపొందించడం.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల గాథలు పిల్లలకు తెలియజేసి వారిలో స్ఫూర్తిని నింపేందుకు కేంద్ర ప్రభుత్వం వీర్ గాథా- 4.0 పోటీల నిర్వహణకు సిద్ధమైంది. రక్షణ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో వరుసగా నాలుగో ఏడాది పోటీలు నిర్వహిస్తున్నారు.

3 నుంచి ఇంటర్ వరకు..: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 3 నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు పోటీలకు హాజరుకావచ్చు. 3 నుంచి 5 తరగతుల విద్యార్థులు 150 పదాలు మించకుండా 'నా రోల్ మోడల్' అనే పేరుతో గ్యాలెంట్రీ అవార్డు పొందిన దేశభక్తునిపై వ్యాసం లేదా చిత్రలేఖనం చేయాల్సి ఉంటుంది. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులు గ్యాలెంట్రీ అవార్డు పొందినవారు దేశం కోసం చేసిన త్యాగాన్ని వివరిస్తూ 300 పదాలకు మించకుండా వ్యాసం లేదా డ్రాయింగ్ లేదా మల్టీమీడియా ప్రదర్శన ఇవ్వాలి. 9-10 విద్యార్థులు 'రాణి లక్ష్మీభాయి కలలోకి వస్తే.. నీవు దేశసేవ ఎలా చేస్తావు' అనే అంశంతో 750 పదాల వ్యాసం లేదా డ్రాయింగ్, మల్టీ మీడియా ప్రదర్శన ఇవ్వవచ్చు. ఇంటర్ విద్యార్థులు స్వాతంత్ర్య ఉద్యమంలో 1857 తిరుగుబాటు నిన్ను ప్రేరేపించిన అంశం ఏంటి.. దానిపై వెయ్యి పదాలకు మించకుండా వ్యాసం, చిత్రలేఖనం చేయాల్సి ఉంటుంది.

పోటీలు ఎప్పుడు?

ఈనెల 17 నుంచి నవంబరు 10 వరకు జిల్లాస్థాయి, నవంబరు 12 నుంచి 30 మధ్యలో రాష్ట్రస్థాయి, డిసెంబరు 4 నుంచి 24 వరకు జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తారు. ఔత్సాహిక విద్యార్థులు mygov.in వెబ్‌సైట్‌లో వీర్ గాథా పేజీ క్లిక్‌చేసి అందులో వివరాలు నమోదు చేయాలి. నేడు తుది గడువు.

మహిళపై కత్తితో దాడి



బాధితురాలు కరుణతో మాట్లాడుతున్న ఎస్సై సంధ్యారాణి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: సహజీవనం చేస్తున్న మహిళ దూరమైంది. ఎక్కడుందో ఆచూకీ చెప్పాలంటూ ఆ మహిళ తల్లిపై ఓ వ్యక్తి కత్తితో విచక్షణారహితంగా దాడిచేసి గాయపర్చిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సత్తెనపల్లి రంగాకాలనీకి చెందిన భారతి భర్తతో విభేదాల కారణంగా దూరంగా ఉంతోంది. ఆమె పిల్లలతో తల్లిదండ్రుల వద్ద జీవనం సాగిస్తోంది. ఈక్రమంలో రెండేళ్లుగా సుందరయ్యనగర్‌కు చెందిన బైక్ మెకానిక్ పూర్ణచంద్రరావు అలియాస్ పూర్ణ భారతికి పరిచయమయ్యాడు. వారిద్దరూ సహజీవనం చేస్తున్నారు. పూర్ణ వేధింపులకు గురి చేస్తుండటంతో భరించలేక అతడికి చెప్పకుండా ఆమె గుంటూరుకు వెళ్లి అక్కడే బంధువుల వద్ద ఉంటోంది. ఆమె ఆచూకీ తెలుసుకోవాలని బైక్ మెకానిక్ ఎంత ప్రయత్నించినా తెలియరాలేదు. దీంతో ఆమె తల్లి కరుణ ఇంటి వద్దకు సోమవారం వెళ్లి గొడవ పెట్టుకున్నాడు. 'నీ కుమార్తె ఎక్కడ ఉంటుందో చెప్పాలని, ఫోన్‌లో మాట్లాడించాలని కోరాడు'. కుమార్తె ఎక్కడ ఉంటుందో తనకు తెలియదని చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో అతడు కత్తితో ఆమెపై దాడిచేసి గాయపర్చి పరారయ్యాడు. కుటుంబీకులు ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమచికిత్స అనంతరం గుంటూరు సమగ్రాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐలు బ్రహ్మయ్య, సుబ్బారావు ఆసుపత్రికి చేరుకుని ఘటనపై విచారణ చేశారు. బాధితురాలి నుంచి వివరాలను ఎస్సై సంధ్యారాణి తెలుసుకున్నారు.

ఆటోడ్రైవరు దుర్మరణం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటోడ్రైవరు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి బ్రాహ్మణపల్లి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని ఆకురాజుపల్లి మేజరుపై చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవరు లక్ష్మయ్య(45) ఆకురాజుపల్లి మేజరు పక్కన ఏర్పాటు చేసిన ఓ టీస్టాల్‌లో టీ తాగారు. ఇంటికి వెళ్లటానికి ఆటోను కాల్వ దగ్గర ప్రధాన రోడ్డుపై యూటర్న్ వద్ద తిప్పగానే కందుకూరు నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఆటో ముందుభాగం దెబ్బతిని డ్రైవర్ రోడ్డు మీద పడి దుర్మరణం చెందాడు.

బియ్యం, కూరగాయలు ఎక్కడ?

అంగన్‌వాడీ కేంద్రంలో నిర్లక్ష్యం



కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ

బెల్లంకొండ(వెంకటాయపాలెం), న్యూస్‌టుడే: వెంకటాయపాలెం ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, పౌష్టిక ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదుతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. వనజ సోమవారం కేంద్రాన్ని తనిఖీ చేశారు. తొలుత రికార్డులు పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులతో మాట్లాడారు. ఆటో బాడుగ ఎక్కువ కావడంతో బియ్యం తీసుకురాలేదని, ఆకుకూరలు అంగన్‌వాడీ కార్యకర్త ఇవ్వడం లేదని, పప్పు ఉడకక పోవడంతో నీళ్లు ఎక్కువ అవుతున్నాయని నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆమె ఆగ్రహించారు. నాణ్యమైన ఆహారం ఇవ్వడం లేదు. రికార్డులను సక్రమంగా నిర్వహించడం లేదంటూ మండిపడ్డారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యకర్త భూక్యా భవాని బాయి, సహాయకురాలు భూక్యా అమలబాయిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 157, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.98/-.

నరసరావుపేట
•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

ఉపాధ్యాయులకు సన్మానం

శావల్యాపురం : శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు గుంటూరు రోటరీ క్లబ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేసింది. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాల ఆవరణలో వారికి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా బెజవాడ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు బి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. గుంటూరు రోటరీ క్లబ్ వారు ప్రధానోపాధ్యాయిని బొడ్డపాటి విజయ లక్ష్మికి ఉత్తమ మహిళ ఉపాధ్యాయ అవార్డు అందజేశారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు కుమ్మరి శ్రీనివాసరాజుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, వ్యాయామోపాధ్యాయుడు రాగుల రాధాకృష్ణమూర్తికి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఉపాధ్యాయులను సత్కరించి, శాలువాతో సన్మానించి ప్రత్యేక జ్ఞాపికలు అందజేశారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నరసరావుపేట అర్బన్ : పురపాలక సంఘంలో విధుల నుంచి తొలగించిన ఒప్పంద ఉద్యోగులు, కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల వద్ద సోమవారం నిరసన తెలిపారు. నరసరావుపేట పురపాలక సంఘంలో ఒప్పంద ఉద్యోగులపై రాజకీయ వేధింపులు పెరిగాయని తెలిపారు. 12 రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రెండు నెలలుగా జీతాల బకాయిలు ఉన్నట్లు చెప్పారు. ఇదే అంశంపై పురపాలిక ప్రత్యేకాధికారి, ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌కు అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. నేతలు శిలార్ మసూద్ ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? బరంపేట మసీదు వెనుకనున్న మదరసా ఎదురుగా చెత్త వేయడం వల్ల దుర్వాసనతో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు మదరసా ఎదుట చెత్త డబ్బాలు తీసేయాలి. **- మణిబాబు, స్థానికుడు**

✔ సిబ్బందికి తెలియజేసి చెత్త డబ్బాలు తొలగిస్తాం.
- ఎం.జస్వంత్‌రావు, మున్సిపల్ కమిషనర్, నరసరావుపేట
- మల్లమ్మ సెంటర్(నరసరావుపేట) – ఈపూరు, న్యూస్‌టుడే:

? మండలంలోని ఇనుమెళ్ల ఎస్సీకాలనీ మెయిన్ బజార్‌లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ పాడై నెల రోజులుగా అధిక ఓల్టేజీ వస్తోంది. దీంతో ఫ్రిజ్‌లు, టీవీలు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయి. **-రంజన్**

✔ కాలనీలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి సమస్య నెలకొంది. ప్రస్తుతం సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల కొరత ఉంది. వీటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. రాగానే సమస్య పరిష్కరిస్తాం. **-గాంధీబాబు, ఏఈ ఈపూరు**

ఉల్లి ఘాటెక్కుతోంది

పది రోజుల్లో అమాంతం పెరిగిన ధర
వినియోగదారులపై భారం

వినుకొండ రూరల్, వినుకొండ, న్యూస్‌టుడే

వినుకొండ మార్కెట్లో ఉల్లి రోజురోజుకూ ఘాటెక్కుతోంది. కర్నూలు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి దిగుమతి తగ్గి ధరలు పైపైకి వెళ్తున్నాయి. వినుకొండ పట్టణంలోని హోల్‌సేల్ దుకాణాలకు నిత్యం మూడు లారీల వరకు ఉల్లిపాయల బస్తాలు వస్తుంటాయి. ప్రస్తుతం దిగుబడి తగ్గి ధరలు పెరుగుతున్నాయి. కర్నూలు, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి వినుకొండ పట్టణానికి ఉల్లి దిగుమతి అవుతుంది. అక్కడి నుంచి నూజండ్ల, శావల్యాపురం, బొల్లాపల్లి, ఈపూరు, వినుకొండ రూరల్ మండలాలకు తరలిస్తారు. కర్నూలు తదితర ప్రాంతాల్లో అనావృష్టి, మహారాష్ట్రలో అతివృష్టి పరిస్థితులు ఉల్లి పంటపై ప్రభావం చూపుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.



దుకాణంలో అమ్మకానికి ఉంచిన ఎరుపు, తెలుపు ఉల్లిపాయలు

పది రోజుల్లో రూ.15 పెరుగుదల

ప్రతి ఇల్లు, హోటల్, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితర వాటికి ఉల్లి అవసరం రోజూ ఉంటుంది. అనుకున్న స్థాయిలో సరకు దిగుమతి లేని కారణంగా కిలోకు ఒక్కసారిగా రూ.10 నుంచి రూ.15 వరకు పెరిగింది. పది రోజుల క్రితం రూ.40, రూ.45 ఉన్న ఉల్లి ధర అమాంతంగా రూ.60కి చేరింది. రోజురోజుకూ పెరుగుతున్న ధరలు వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఎడతెరిపి లేని వర్షం

➟ వీధుల్లో నిలిచిన నీరు ➟ రాకపోకలకు ఇక్కట్లు

చిలకలూరిపేట పట్టణం, గణపవరం, న్యూస్‌టుడే

రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎడతెరిపి లేని వర్షం వల్ల పట్టణంలో పలు ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఏఎంజీ పాఠశాల నుంచి గణపవరం వెళ్లే మార్గంలో వర్షం నీటితో కాల్వలు పొంగి రోడ్డు మీదకు నీరు చేరాయి. పట్టణంలోని జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు మీద, చిలకలూరిపేట నుంచి చీరాల వెళ్లే మార్గంలో రోడ్డు మీద నీరు పారుతున్నాయి. రోడ్ల మధ్యలో ఉన్న గుంతల్లో వర్షం నీరు వచ్చి చేరగా అవి గుర్తించని పలువురు వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో అదుపు తప్పి కింద పడుతున్నారు. చిలకలూరిపేట నుంచి గణపవరం వెళ్లే మార్గంలో ఈ దుస్థితి నెలకొంది. వీటితో పాటు గృహాల పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లోకి నీరు వచ్చి చేరాయి. సంజీవనగర్, రూత్‌లైక్‌మెన్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, సుబ్బయ్యతోట, జాలయ్యకాలనీ, జిడ్డుకాలనీ, వైఎస్సార్ కాలనీ ఇలా పలు ప్రాంతాల్లో వర్షం నీరు చేరాయి.



చిలకలూరిపేట నుంచి గణపవరం వెళ్లే రహదారిలో నీరు



చీరాల రహదారిలో రోడ్డుపై నీరు



నీట మునిగిన వరి పొలాలు

రైతుల బెంబేలు

నూజండ్ల : అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు బెంబేలెత్తుతున్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మాగాణిలో పంటలు నీటి మునిగాయి. మెట్ట పంటల్లో నీరు నిలబడటంతో ఉరకెత్తుతాయని రైతులు భయపడుతున్నారు. కంది, మిరప, పొగాకు, మినుము, పత్తి తదితర పంటల్లో నీరు నిలిచి రైతులు ఆందోళన చెందుతున్నారు. మట్టిరోడ్లు పూర్తిస్థాయిలో దెబ్బతింటున్నాయి. నూజండ్ల- పమిడిపాడు, చెరువుకొమ్ముపాలెం, జడ్డా వారిపాలెం- ముక్కెళ్లపాడు, చింతలచెరువు, గురపనాయుడుపాలెం- కంభంపాడు, ఐనవోలు గ్రామాల రహదారుల్లో రవాణా నిలిచింది.

కిక్కిరిసిన బస్సులు.. రద్దీగా రైళ్లు



రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : దసరా పండగకు సొంత ఊళ్లకు వచ్చిన విద్యార్థులు, ప్రయాణికులతో బస్సులు, రైళ్లు రద్దీ నెలకొంది. ఆదివారంతో సెలవులు ముగియడంతో రాకపోకలు పెరిగాయి. సొంతూళ్ల నుంచి కళాశాలలకు, బంధువుల ఇళ్లకు వచ్చినవారు, ఇతర పర్యాటక కేంద్రాలకు వెళ్లి తిరుగుముఖం పట్టిన వారితో రైళ్లు, బస్సులు కిక్కిరిశాయి.

ఆర్టీసీ ముందస్తు చర్యలతో..

ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ముందస్తు చర్యలు చేపట్టగా కొంతమేర సమస్య తీరింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ నుంచి నరసరావుపేట, జిల్లాలోని నాలుగు డిపోల్లో సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. దీంతో ప్రయాణికులు రద్దీగా ఉన్నా సరిపడా బస్సులు ఉండటంతో గమ్యస్థానానికి చేరారు. పల్నాడు ప్రాంతం నుంచి గుంటూరు, విజయవాడ, పలు ప్రాంతాలకు రైలులో ప్రయాణించేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరోనా సమయం నుంచి ప్యాసింజర్లు తగ్గిపోవడంతో పండగలు, సెలవుల సమయంలో రైళ్లల్లో రద్దీ ఏర్పడుతోంది. నిలబడే స్థలం లేక గంటల తరబడి నిలబడి ప్రయాణించామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు కొత్త ఊపిరి




బోడిశంభునివారిపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ఈపూరు : వైకాపా నిరంకుశపాలనలో నిధులను పక్కదారి పట్టించి జగన్‌మోహన్‌రెడ్డి పీకనులిమేసిన పంచాయతీలకు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు కేటాయించి కొత్త ఊపిరి పోస్తున్నారని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో బాగంగా ఈపూరు మండలం బోడిశంభునివారిపాలెం, బోడెపూడివారిపాలెంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. బోడిశంభునివారిపాలెంలో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి, బోడెపూడివారిపాలెంలో మినీ గోకులం షెడ్డుకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, బూసిరెడ్డి, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, ఎంపీడీవో ప్రభాకర్‌రావు, తెదేపా నాయకులు యలవర్తి చినవీరాంజినేయులు, బొల్లా రామకృష్ణ, తిరుమలశెట్టి బాలయ్య, అయినాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పల్లె పండగతో గ్రామ స్వరాజ్యం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : తెదేపా చేపట్టిన పల్లె పండగ కార్యక్రమంతో గ్రామ స్వరాజ్యం సాధ్యమని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. మండలంలోని లింగంగుంట్ల, ఇక్కుర్రు, అల్లూరివారిపాలెం, రావిపాడు గ్రామాల్లో సోమవారం పల్లె పండగ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రావిపాడులో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, మురుగు కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అల్లూరివారిపాలెంలో రూ.15 లక్షలు, ఇక్కుర్రులో రూ.25 లక్షలు, లింగంగుంట్లలో రూ.55 లక్షలతో చేపట్టనున్న పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి, నరసరావుపేట అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.హీరాలాల్, సుబ్బరాయుడు, ఎంపీడీవో కృష్ణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

నూజండ్ల : గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని జడ్పీటీసీ జడ్డా సుబ్బులు అన్నారు. పల్లె పండగ కార్యక్రమాన్ని సోమవారం చెరువుకొమ్ముపాలెంలో ప్రారంభించారు. రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో ఉమాదేవి, ఏఈ అల్లాభక్షు, నేతలు జడ్డా రామయ్య, కరిముల్లా, ప్రభాకర్, వెంకట్రామయ్య తదితరులున్నారు.



లింగంగుంట్లలో జలజీవన్ మిషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

రొంపిచర్ల : ప్రతి పల్లెకు రహదారి, ప్రతి వీధిలో సీసీ రోడ్డు వసతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పంచాయతీరాజ్ శాఖ ఏఈ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పరగటిచర్లలో పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం రూ.8 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి స్థానిక మహిళలతో కలసి ఆయన శంకుస్థాపన చేశారు.

శావల్యాపురం : పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు మండలంలోని పిచికలపాలెం, చినకంచర్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేపట్టినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు.

యడ్లపాడు : మండలంలోని ఉన్నవలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు తెదేపా నేతలు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, తెదేపా నేతలు కుర్రా రత్తయ్య, బాలినేని హనుమంతరావు, కాకుమాను శ్రీను, సర్పంచి సరళ, సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే..?





ఇద్దరి వరకు ద్విచక్ర వాహనంపై ప్రయాణించవచ్చు. అత్యవసరమైతే మరొకరు ఎక్కడం చూస్తున్నాం. కానీ ఏకంగా ఆటోలో ఎక్కినట్లు ఐదుగురు ఒకే వాహనంపై ఎక్కి ప్రయాణిస్తున్నారు. ఇలా వెళ్తూ కొన్ని సందర్భాల్లో ప్రమాదాల్లో పడుతున్న సంఘటనలు అనేకం. వినుకొండలో సోమవారం ఇలా ఒకే వాహనంపై ఐదుగురు ప్రయాణించారు.

-వినుకొండ రూరల్, న్యూస్‌టుడే

దారంతా ఇలా.. పొలం చేరేదెలా?

మండలంలోని గంగన్నపాలెంలో పొలాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షం పడినా బురదమయంగా మారి దిగబడిపోతున్నాయి. దీంతో పొలాలకు ఎరువులు తీసుకెళ్లాలన్నా ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి గ్రావెల్‌తో రహదారి నిర్మించాలని రైతాంగం వేడుకుంటోంది.

-న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ



అధ్వానంగా రహదారి

ఆదమరిస్తే.. అంతే సంగతులు

నరసరావుపేట- సత్తెనపల్లి మార్గంలోని ములకలూరు వేగనిరోధకం వద్ద రహదారి వర్షాలకు దెబ్బతింది. గుంతల్లో నీరు నిలుస్తోంది. రాత్రిపూట వాహన చోదకులు దీన్ని గమనించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని ర.భ శాఖ అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్



చేతులు శుభ్రం.. ఆరోగ్యం పదిలం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే

అపరిశుభ్రతతో వ్యాధులు
నేడు "ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం"

వ్యాధులను నివారించాలన్నా, ఆరోగ్యం బాగుండాలన్నా చేతుల శుభ్రత తప్పనిసరి. చేతుల ద్వారానే అన్ని సూక్ష్మజీవులు, క్రిములు కడుపులోకి ప్రవేశిస్తాయి. తద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. కనుక పనులు చేశాక తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అందుకే ఏటా అక్టోబరు 15న 'ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది 'స్వచ్ఛమైన చేతులు ఇప్పటికీ ఎందుకు ముఖ్యం' అనే థీమ్‌తో అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ముఖ్యంగా కొవిడ్-19 మహమ్మారి తర్వాత అంటువ్యాధుల నివారణలో చేతుల శుభ్రత ఎంత ముఖ్యమో ఈ థీమ్ నొక్కి చెబుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2024లో ఈ నినాదంతో ముందుకు సాగాలని సూచిస్తోంది.

రోగాల నివారణ

చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల డయేరియా, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, జలుబు, ఫ్లూ, కరోనా వంటివి అరికట్టవచ్చు. ఏటా ప్రపంచవ్యాప్తంగా వందల మిలియన్ల మంది వీటి బారిన పడుతున్నారు. కొవిడ్-19 తర్వాత చేతుల శుభ్రత తప్పనిసరిగా పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.



చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

పాటించాల్సినవి

- ★ చేతులు స్వచ్ఛమైన నీటితో పరిశుభ్రంగా కడుక్కోవాలి.
- ★ తగినంత సబ్బు చేతికి రాసుకుని బాగా రుద్దుకోవాలి.
- ★ చేతుల వెనుక వైపు, వేళ్ల మధ్యలో, గోర్ల మధ్యలో బాగా రుద్ది కడుక్కోవాలి.
- ★ నిత్య కృత్యాలు తీర్చుకున్నాక, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- ★ చేతుల శుభ్రత అనంతరం మంచి వస్త్రంతో తుడుచుకోవాలి.

అలవాటుగా మార్చాలి

చేతులు శుభ్రం చేసుకుంటే వ్యాధులు దూరం చేయొచ్చు. దీన్ని చిన్నతనం నుంచే పిల్లలకు అలవాటు చేయాలి. పాఠశాలలో ఉపాధ్యాయులు ఏటా 'ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం' నిర్వహిస్తున్నారు. చేతుల శుభ్రత విషయంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చేతులు శుభ్రంగా లేకపోవడం వల్ల డయారియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలుతాయి.

-ఏడుకొండలు, ఆర్ఎంవో, నరసరావుపేట ఏరియా వైద్యశాల

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : లారీ- ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. గ్రామీణ పోలీసుల కథనం మేరకు మండలంలోని గోనెపూడికి చెందిన కొండా అనిల్‌కుమార్ (24) సోమవారం ద్విచక్ర వాహనంపై ఈటీ వైపు వెళుతుండగా ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై కిషోర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి సోదరుడు చెంచు రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా.. క్లీనర్‌కు తీవ్రగాయాలు

రొంపిచర్ల, న్యూస్‌టుడే : అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పరిధిలోని మర్రిచెట్టుపాలెం వద్ద లారీ బోల్తా పడి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు సోమవారం వేకువన నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు కెమికల్ పౌడర్‌తో లారీ బయలుదేరింది. తెల్లవారుజామున మండలంలోని మర్రిచెట్టుపాలెం వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోగా అదుపు తప్పి రాష్ట్రీయ రహదారి పక్కనే ఉన్న వాగులో బోల్తా కొట్టింది. ప్రమాదంలో క్లీనర్ తలకు గాయం కాగా, డ్రైవర్ గాయాలతో బయటపడ్డాడు.

ముక్కు మూసుకోవాల్సిందే

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : మండలంలోని తిమ్మాయిపాలెంలో రోడ్డు పక్కనే వ్యర్థాలు వేస్తుండటంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోందని, దోమల వ్యాప్తి కూడా అధికమై ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చెత్త నిల్వలను శుభ్రం చేయిస్తామని ఈవోపీఆర్డీ సుందరరెడ్డి తెలిపారు.



మురుగునీటిలో కలిసిన వ్యర్థాలు

పొగాకు వాడకం హానికరం



టుబాకో ఫ్రీ స్కూల్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే : పొగాకు వాడకం హానికరమని, పొగ పీల్చినా, నమిలినా ఆరోగ్యానికి హానికరమని వి.రెడ్డిపాలెం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రవినాయక్ అన్నారు. మండలంలోని పీఎం.శ్రీ వి.రెడ్డిపాలెం ఆదర్శ పాఠశాలలో సోమవారం టుబాకో ఫ్రీ స్కూల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పొగాకుకు వ్యతిరేకంగా ఉపాధ్యాయులు ఎం.ప్రభుదాస్, షేక్ కరిముల్లా విద్యార్థులతో ప్రతిజ్ఞ, నినాదాలు చేయించారు.

అవీ ఇవీ

ఒకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు



బేకరీలో విద్యార్థినులు, ఉపాధ్యాయిని

నూజండ్ల : ఒకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ప్రిన్సిపల్ రమణమ్మ అన్నారు. ఉప్పలపాడు అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల 10వ తరగతి, ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులను వృత్తి విద్యా నైపుణ్యాల పెంపుదలకు శిక్షణ సమగ్ర శిక్ష, టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ ఆధ్వర్యంలో దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం పది రోజులు నిర్వహించారు. గ్రూపులుగా ఏర్పడిన విద్యార్థులు పరిశ్రమల పరిశీలన నిమిత్తం వినుకొండలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లారు. బేకరి సందర్శించారు. ఒకేషనల్ కో- ఆర్డినేటర్లు శ్రీను, కార్తీక్, ఉపాధ్యాయిని ఉషారాణి తదితరులున్నారు.

వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్ కోరారు. తన కార్యాలయంలో వీఆర్వోలతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న కంట్రోల్ రూమ్‌లో కేటాయించిన సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. వాగులో పొంగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సమావేశంలో కార్యాలయ పర్యవేక్షకుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనం నేపథ్యంలో టోల్‌ఫ్రీ నంబరు కేటాయింపు

వినుకొండ, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో వర్షాలకు ఎదురయ్యే సమస్యలను తెలియజేసేందుకు పురపాలక సంఘంలో టోల్‌ఫ్రీ నంబరు 08646-273656కు తెలియజేయాలని పురపాలక సంఘ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. పట్టణంలోని కోటనాల్సా బజారులో నీరు వెళ్లకుండా కాలువలో అడ్డు పడుతున్న పూడిక తొలగింపు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పాడైన రోడ్లకు త్వరలో మరమ్మతులు చేయిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు తీగలు, స్తంభాలకు పిల్లలను దూరంగా ఉంచాలని ఆయన సూచించారు.

రేషన్ సరకులు ఇవ్వలేదని ఫిర్యాదు

బొల్లాపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని కనుమలచెర్వు చౌక ధరల దుకాణంలో ఈనెల నిత్యావసర సరకులు పంపిణీ చేయలేదని తెలుగు యువత నాయకుడు నిమ్మకాయల బాబురావు తెలిపారు. అధికారులు విచారించి బాధ్యులపైన చర్యలు తీసుకోవాలని, కార్డుదారులకు సరకులు సక్రమంగా సరఫరా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైతుల్లో ఆందోళన

వినుకొండ, న్యూస్‌టుడే : అల్పపీడనం ప్రభావంతో సోమవారం తెరిపి లేకుండా వర్షం జల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో జన జీవనానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. పంట పొలాల్లో నీళ్లు నిలబడి వ్యవసాయ పనులకు అంతరాయం కలిగింది. మరో మూడు రోజులు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ సూచనలతో రైతులు పంటలు ఉరకెత్తుతాయన్న ఆందోళనలో ఉన్నారు.

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట) : పట్టణంలో సోమవారం ఎడతెరిపి లేకుండా వాన పడుతూనే ఉంది. పలు వార్డుల్లో విద్యుత్తు ఫీజల సమస్యలు తలెత్తడంతో కొంత సమయం సరఫరా నిలిచింది. వర్షంలో విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

యడ్లపాడు, న్యూస్‌టుడే : మండలంలోని తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వ్యాయామోపాధ్యాయుడు కాటూరి కృష్ణన్, రాజేశ్వరి దంపతులు పాఠశాలకు రూ.30 వేల విలువైన ప్రింటర్, మైక్‌సెట్ సోమవారం బహుమతిగా అందజేశారు. వారిని హెచ్ఎం వెంకటాద్రినాయుడు, గ్రామపెద్దలు అభినందించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

నూజండ్ల : సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డీఆర్సీ డీడీఏ శివకుమారి అన్నారు. ఐనవోలు, ముర్తింజాపురం రైతుసేవా కేంద్రాల్లో సోమవారం మహిళా రైతులకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రాఫ్తార్ పథకంలో భాగంగా సాగులో యాజమాన్య పద్ధతులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వివిధ పంటల సాగులో మొదటి విత్తనశుద్ధి తప్పనిసరి అన్నారు. విత్తనశుద్ధి చేసే విధానాలను ప్రయోగాత్మకంగా చూపారు. ఏవో సుగుణా బేగం, ఏఈవో ఎలీషా, మణికంఠ, అపర్ణ, గోపి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడీఏ శివకుమారి

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు చెక్కు అందిస్తున్న వెంకటరమణారావు

వరద బాధితులకు విరాళం

రాజుపాలెం, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకు నేందుకు దాతలు కదలి వస్తున్నారు. రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపా రవేత్త గుంటుపల్లి వెంకట రమణారావు రాష్ట్ర వరద బాధి తుల సహాయార్థం రూ.లక్ష విరాళం ప్రకటించారు. సోమ వారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసి చెక్కు అందించారు. వరద బాధితులను దాతలు ఆదుకునేందుకు తోడ్పాటు అభినందనీయమని కన్నా అన్నారు.

వైకాపా పాపాలే శాపాలు

మాచవరం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో చేసిన పాపాలు, నేడు రాష్ట్రానికి శాపా లుగా మారాయని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు గ్రామాల్లో ప్యాక్షనిజాన్ని ప్రోత్సహించడం, తెదేపా శ్రేణులపై దాడులకు దిగటం తప్పితే అభివృద్ధి ఎక్కడా లేద న్నారు. 'పల్లె పండగ.. పంచాయతీ వారోత్సవాల్లో' భాగంగా సోమవారం మండలంలోని తురకపాలెం, కొత్తపాలెంలో సిమెంట్ రహదారులు, మురుగు కాలు వల నిర్మాణానికి యరపతినేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి దశలో నియోజకవర్గానికి రూ.10 కోట్ల నిధులు మంజూర య్యాయన్నారు. గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రహదారులు, తాగు నీరు, ఎత్తిపోతల పథకాలు, గృహ నిర్మాణానికి తగిన ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

? పట్టణంలోని గడియార స్తంభం వద్ద రాత్రయితే వీధిలైట్లు అలు ముకుంటోంది. నాలుగు రోడ్ల కూడలిలో వీధి దీపాలు సక్రమంగా పనిచేయట్లేదు. - **వ్యాపారులు**

✔ వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. చీకటి లేకుండా చూస్తాం. - **షమ్మి, మున్సిపల్ కమిషనర్**

? పట్టణంలోని నందిగామ డొంక రోడ్డులో యాదవ హాస్టల్ నుంచి చర్చి వరకు చిన్నపాటి వర్షం కురిసినా వర్షపు, మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. - **స్థానికులు, నాగార్జుననగర్**

✔ మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి వర్షపు నీరు రోడ్డుపై పారకుండా చూస్తాం. - **షమ్మి, కమిషనర్**

? పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి నుంచి రఘురాంనగర్‌లోకి వెళ్లే రోడ్డు మార్గంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగు మెరుగునకు చర్యలు చేపట్టాలి. - **స్థానికులు, రఘురాంనగర్**

✔ ప్రధాన రహదారి నుంచి రఘురాంనగర్‌లోకి వెళ్లే మురుగు కాలువ స్వచ్ఛత చర్యలు చేపడతాం.

- **షమ్మి, మున్సిపల్ కమిషనర్** - న్యూస్‌టుడే, సత్తెనపల్లి

కొత్త విధానం.. క్లిష్టతరం!

☛ పౌష్టికాహారం పంపిణీకి ముఖ ఆధారిత హాజరు ☛ అంగన్‌వాడీ కార్యకర్తలకు కష్టాలు



ముఖ ఆధారిత హాజరు వద్దంటూ ఐసీడీఎస్ సీడీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ సంఘ నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా చేసే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ముఖ ఆధారిత హాజ రును వర్తింపజేస్తున్నారు. ఇప్ప టివరకు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీకి ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేశారు. ఈనెల నుంచి పిల్లలకు కూడా ఆదే విధానం అమలు చేయాలంటూ ఉన్నతస్థాయి నుంచి మార్గదర్శకాలు అందాయి. ముఖ ఆధారిత హాజరు నమోదులో ఓటీపీలు కీలకంగా ఉన్నాయి. సెల్‌ఫోన్ నంబర్లు సక్రమంగా లేక తల్లిదండ్రులు ఓటీపీలు చెప్పట్లేదు. దీంతో అంగ న్‌వాడీ కార్యకర్తలు ఇబ్బంది పడుతు న్నారు. ముఖ ఆధారిత హాజరు నమోదు వద్దంటూ వారు పర్యవేక్షకులకు విన్నవిస్తున్నారు.

సాంకేతిక సమస్య: అంగన్‌వాడీ కేంద్రాల్లో 7 నెలల నుంచి 3 ఏళ్ల లోపు(36 నెలలు) చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. రెండున్నర కిలోల బాలామృతం ప్యాకెట్, 25 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందజేస్తున్నారు. చిన్నారులకు ఆది అందజేయా లంటే ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాలని మార్గద ర్శకాలు అందాయి. ఇందుకు చిన్నారి 'ఫేస్ రికగ్నైజేషన్, ఈకేవైసీ, మొబైల్ వెరిఫికేషన్ చేయాలి. ఈ మూడింటికి చిన్నారి పేరుతో అనుసంధానమైన చరవాణి నంబర్లకు ఓటీపీలు వెళ్తున్నాయి. ఆ ఓటీపీల వివరాలు చెప్పాలంటూ తల్లిదండ్రులకు అంగ న్‌వాడీలు కోరితే ఇవ్వట్లేదు. దీనికితోడు సాంకేతిక సమస్యలు తలెత్తి పెదుతు న్నాయి. ఒక ఇంట్లో ముగ్గురు చిన్నారు లుంటే ఇద్దరు చిన్నారులకే తల్లి చరవాణి పనిచేస్తోంది. అంగన్‌వాడీ కార్యకర్తల చరవాణితో పంపిణీ చేయాల్సిన ఐదుగురికి మించి అవకాశం ఉండటం లేదు. ప్రతి సారి ఓటీపీని నమోదు చేయడం క్లిష్టతరంగా ఉంది.

పారదర్శకత కోసమే.. కొత్త విధానం అమలు వద్దంటూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా బాధ్యులు ఐసీడీఎస్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేస్తు న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాల్సిందేనంటూ వారు అవగాహన కార్యక్ర మాలు చేపడుతున్నారు. చిన్నారుల పౌష్టికాహారం పంపి ణీలో మరింత పారదర్శకత కోసం ముఖ ఆధారిత హాజరు విధానాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్లు ఐసీడీ ఎస్ పీడీ ఉమారాణి చెప్పారు. సాంకేతిక సమస్యలుంటే గుర్తించి, పరిష్కరిస్తామన్నారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారుల సంఖ్య
2031	65,020

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి



ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సరితాల్లి కల్యాణ మండపంలో తెదేపా, జనసేన, భాజపా వార్డు, గ్రామ, మండల స్థాయి నాయకుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలన్నారు.

దుర్గామాత సేవలో యరపతినేని



అమ్మవారికి పూజలు చేస్తున్న యరపతినేని

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి నగర పంచాయతీలోని బొడ్రాయి సెంటర్ వద్ద టీవీఎస్ యూత్ నాయకుడు తంగెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దుర్గ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జన వేడుకల్లో సోమవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రూ.5.85 లక్షల పురుగు మందులు సీజ్



సీజ్ చేసిన పురుగు మందుల వద్ద ఇన్‌ఛార్జి ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, వీఆర్వో అనిల్

సత్తెనపల్లి (గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలో అనుమతి లేకుండా గోదాములో నిల్వ చేసిన రూ.5.85 లక్షల విలువైన పురుగు మందులను సీజ్ చేసినట్లు ఇన్‌ఛార్జి ఏడీఏ ఎస్. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వడ్డవల్లిలోని గోదాములో తనిఖీ చేయగా వివిధ కంపెనీలకు చెందిన 418.6 లీటర్ల పురుగు మందులు గుర్తించారు. నిల్వ చేసిన గోదాముకు వ్యవసాయశాఖ అనుమతి లేదని తెలిపారు. సంబంధిత సరకు శివశంకర్ పెస్టిసైడ్స్‌కు చెందినదిగా నిర్ధారించినట్లు అధికారులు పేర్కొన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌ఛార్జి ఏడీఏ వివరించారు. పురుగు మందుల నాణ్యత పరీక్షలకు ల్యాబ్‌కు పంపిస్తామన్నారు.

అటు పచ్చదనం.. ఇటు పిచ్చి చెట్లమయం



పిడుగురాళ్ల రోడ్డులోని డివైడర్ మధ్య పిచ్చిచెట్లు



సత్తెనపల్లిలో పచ్చని చెట్లు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ప్రధాన రహదారిపై సత్తెన పల్లి వరకు పచ్చదనం ఉండగా.. మండల పరిధి లోని సెంట్రల్ డివైడర్ మధ్య పిచ్చిచెట్లు అలుముకున్నాయి. పిడుగురాళ్ల రోడ్డు వైపు పట్టణ పరిధిలోని ఈద్గా తర్వాత నుంచి కంకణాలపల్లి వరకు మొక్కలు నాటలేదు. దీంతో పిచ్చిచెట్లతో కళావిహీనంగా కనిపిస్తోంది. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని నింపే చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తెలంగాణలో ఉపాధ్యాయ కొలువు

రెంటచింతల, న్యూస్‌టుడే: రెంటచింతల యువకుడు షేక్ ఆలీం బాషా తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. గత ఆగస్టులో మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి నాగర్ కర్నూలు జిల్లా ఉర్దూ మీడియం పాఠశాలలో హిందీ పండిట్‌గా చేరారు. నల్గొండ జిల్లా నుంచి నాన్‌లోకల్ కోటాలో ప్రవేశ పరీక్షకు హాజరై హిందీలో మొదటి ర్యాంకు సాధించారు.

తెదేపా నాయకుడి మృతి తీరనిలోటు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: మాచర్ల మండలం అచ్చమ్మకుంట గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు రమావత్ రంగా నాయక్ గుండెపోటుతో మృతి చెందారు. తెదేపా రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ధారు నాయక్ సోమవారం రంగానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

నూజెండ్ల: సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డీఆర్సీ డీడీఏ శివకుమారి అన్నారు. ఐనవోలు, ముప్పరాజువారి రైతు సేవా కేంద్రాల్లో సోమవారం మహిళా రైతులకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రఫ్తార్ పథకంలో భాగంగా సాగులో యాజమాన్య పద్ధతులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వివిధ పంటల సాగులో మెరుగైన విత్తనశుద్ధి తప్పనిసరి అన్నారు. విత్తనశుద్ధి చేసే విధానాలను ప్రయోగాత్మకంగా చూపారు. ఏవో సుగుణ బేగం, ఏఈవో ఎలీషా పాల్గొన్నారు.

రాష్ట్ర పండగగా వాల్మీకి జయంతి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ఆది కవి వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండగగా ప్రభుత్వం ప్రకటించడంపై వాల్మీకిబోయ సాధికార సమితి జిల్లా కన్వీనర్ ముప్పన వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 17న వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బోయలందరూ కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు.

పట్టుదలతో చదవాలి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: విద్యార్థులు దీక్ష, పట్టుదలతో విద్యాభ్యాసం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కోదండరామ స్వామి కల్యాణ మండపంలో ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఆర్జీఎస్ విశ్రాంత ఉద్యోగి ఆవుల వెంకటేశ్వర్లు పది, ఇంటర్, ఎంసెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎమ్మెల్యే ద్వారా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, డాక్టర్ రామకోటయ్య, శేషారెడ్డి, దుర్గారావు, రామకృష్ణ, వెంకటరమయ్య, నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతలలో వైద్య శిబిరం

రెంటచింతల, న్యూస్‌టుడే: రెంటచింతల గిరిజన కాలనీలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణారెడ్డి తెలిపారు. 45 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

అమరేశ్వరాలయంలో ధాన్యకూటోత్సవం

అమరావతి, న్యూస్‌టుడే: దసర శరన్నవ రాత్రి ఉత్సవాలు అమరేశ్వరాలయంలో విజయవంతంగా ముగిశాయి. సోమవారం ఆలయ అర్చకులు ధాన్యకూటోత్సవం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. వసంతోత్సవం, గ్రామోత్సవం నిర్వహించారు. ఈఓ వేమూరి గోపి పాల్గొన్నారు.

ఇంటర్నెట్ సేవలకు అంతరాయం

నకరికల్లు, న్యూస్‌టుడే: మండలంలోని కేబుల్ తీగలకు ముఖ్యమంత్రుల కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కోయడంతో కేబుల్, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి కేబుల్ నెట్‌వర్క్ సేవలను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

హడావుడితో సరి



అభివృద్ధికి నోచుకోని కీలక దారి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో తొలి అభివృద్ధి పనిగా భూమిపూజ చేసిన రోడ్డు అది. శాశ్వత డ్రైనేజీ నిర్మాణం పేరుతో పెదల ఇళ్లను తొలగించి హడావుడి చేశారు. నిధులు కేటాయించారు.. ఆ తర్వాత మార్గంలోని ట్రాఫిక్‌ను ఆటువైపు మళ్లించే అవకాశముండి. ఆలాగే శాశ్వత డ్రైనేజీ నిర్మాణం చేపడితే మురుగు చింత ఉండదు. కీలక రోడ్డు నిర్మాణంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఐదేళ్ల పట్టించుకోలేదు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో మీ-సేవా కేంద్రం వెనుక, తారకరామసాగర్ వాకింగ్ ట్రాక్ ఆనుకుని ఉన్న రోడ్డు కీలకమైనది. ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే రైల్వేస్టేషన్

నడిరోడ్డుపై గుంత.. ప్రయాణికులకు చింత



అమరావతి, న్యూస్‌టుడే: అమరావతిలోని సత్తెనపల్లి రోడ్డు కూడలిలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లలోతు గుంత పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి పైపులైన్ లీకేజీ కారణంగా తరచూ ఇక్కడ రహదారి కుంగి గుంత పడుతోంది. సుమారు రెండేళ్లుగా ఇదే తంతు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఇటీవల పక్షానే మరో గుంత ఏర్పడింది. ఆ గుంతలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్‌ను అడగ్గా.. ఇప్పటికే పలుమార్లు పూడ్చామని, పైప్ లైన్ లీక్ కారణంగా తరచూ గుంతలు పడుతున్నాయన్నారు.

గాంధీనగర్.. జనం బేజార్



రోడ్డుపైనే విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని గాంధీనగర్ ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. మురుగునీరు పారుదల వ్యవస్థ సక్రమంగా లేదు. కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతంలో సుమారు 600 కుటుంబాలు నివసిస్తున్నాయి. మురుగు కాలువల్లో పూడిక తీసేవారు లేరు. వారానికి ఒక్కసారి కూడా కార్మికులు రావడం లేదు. కొన్ని బజార్లలో రోడ్లపైనా మురుగు పారుతోంది. దోమలకు ఆవాసంగా మారింది. ఇటీవల దోమకాటుతో చాలా మంది జ్వరాల బారిన పడ్డారు. ప్రధానంగా పాతరైల్వేస్టేషన్ రోడ్డులో సమస్య తీవ్రంగా ఉంది. గాంధీనగర్‌లోని ఓ ప్రాంతంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అక్కడ తీగలు కిందకు జారి ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు కోతులను పట్టించి నల మల ప్రాంతంలో వదిలితే వాటి బెడద తగ్గుతుంది. అక్కడ ఉన్న కొన్ని వీధి దీపాలు వెలగటం లేదు. వాటికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పెదవలి సుబ్బారావుకు నివాళి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: వీరాపురం గ్రామానికి చెందిన పెదవలి సుబ్బారావు(92) అనారోగ్యంతో గుంటూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. తమిళనాడు రాష్ట్ర పుద్దగిరుగులశాఖ కమిషనర్ శాఖమూరి చంద్రశేఖర్‌కు పెదవలి సుబ్బారావు తాతయ్య అవుతారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బుగ్గ వాగులో మృతదేహం

దుర్గి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆత్మకూరు సమీపంలో బుగ్గవాగులో సోమవారం ఓ యువకుడి మృతదేహం కొట్టుకు వచ్చింది. సమాచారం అందుకున్న ఎస్సై సుధీర్ కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. చొక్కా జేబులోని గుర్తింపు కార్డు ప్రకారం మాచవరం మండలం రుక్షల్లాకు చెందిన ఎమనూరి వెంకటేశ్వర్లు (38)గా గుర్తించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని తీవ్రగాయాలు

సత్తెనపల్లి (గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి రామక్కపేట సమీపంలో సోమవారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో కృష్ణారెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పిడుగురాళ్ల మండలం తక్కెళ్లపాడుకు చెందిన కృష్ణారెడ్డి ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి వస్తుండగా ఎదురు వచ్చిన కారు ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన ఆయనను సత్తెనపల్లిలోని ప్రైవేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: బాలికతో అస భ్యంగా ప్రవర్తించాడన్న అవమానంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచర్ల మండలం రాయవరంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్సై నారాయణ వివరాల ప్రకారం.. రాయవరం గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల శ్రీనివాసరావు (23) కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇతని మానసిక స్థితి సరిగా లేదు. ఈ నెల 9న ఆదే సమీపంలో ఆడుకుంటున్న బాలిక చేయి పట్టుకుని దాబాపైకి తీసుకెళ్లి కింద పడేశాడు. దీనిపై వివాదం జరగడంతో మనస్తాపానికి గురై 11వ తేదీన ద్విచక్ర వాహనంపై కంభంపాడు అడవుల వైపు వెళ్లి ఆందులో దూకాడు. ఆతడి తల్లిదండ్రులు తమ కుమారుడు కనిపించటం లేదని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరో వైపు బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తెపై శ్రీనివాసరావు అసభ్యంగా ప్రవర్తించాడంటూ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పిర్యాదులపై కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్న పోలీసులకు శ్రీనివాసరావు మృతదేహం బుగ్గవాగు ప్రాంతంలో సోమవారం లభించింది.



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, స్థానిక నేతలు

ప్రతి పల్లెలో ప్రగతి వికాసం



కట్టావారిపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి (గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని పల్లెలు అభివృద్ధి ఫలాలతో వికసించనున్నాయని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. 'పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమాన్ని సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెంలో సోమవారం ఎమ్మెల్యే కన్నా ప్రారంభించారు. రూ.15 లక్షలతో చేపట్టనున్న కంకర రహదారి, కంభంపాడులో రూ.20 లక్షలతో, భీమవరంలో రూ.8 లక్షలతో నిర్మించనున్న సిమెంటు మురుగు కాలువల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

వెల్దుర్తి: మండల పరిధి వెల్దుర్తి, మండాది గ్రామాల్లో నిర్వహించిన వారోత్సవాల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. వెల్దుర్తిలో రూ.50 లక్షలతో, మండాదిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పెదకూరపాడు రూపురేఖలు మారుస్తాం

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు ప్రగతికి కట్టుబడి ఉన్నామని, రహదారుల రూపురేఖలు మారుస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. పల్లె పండగలో భాగంగా పెదకూరపాడులోని అంబేడ్కర్ బొమ్మ సెంటర్ నుంచి పాలకేంద్రం వరకు రూ.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. మండల తెదేపా అధ్యక్షుడు అర్విమల్ల రమేష్, సర్పంచి గుడిపూడి రాజు, నాయకులు గోపారావు, అప్పారావు, బాలయ్య, బ్రహ్మయ్య, అజిముల్లా తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: పశుగణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీపీ మహేష్ బాబు పేర్కొన్నారు. సోమవారం ఊటుకూరు, అందుకూరు, బయ్యవరం గ్రామాల్లో పల్లెపండగ వారోత్సవాలు నిర్వహించారు.

దుర్గి: మండలంలోని రాజనగర్, నిదానంపాడు, ఒబులేశునిపల్లె గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు.

గురజాల గ్రామీణ: గ్రామాల్లో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, పూడికతీత అభివృద్ధి కార్యక్రమాలను శ్రీకారం చుట్టారు. పాత అంబాపురం, కొత్త అంబాపురం గ్రామాల్లో సోమవారం రూ.20 లక్షలతో పనులు ప్రారంభించారు.

దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు

అచ్చంపేట: పల్లెలు దేశాభివృద్ధికి పట్టుకొమ్మలని ఎంపీడీవో కె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం అచ్చంపేట గ్రామంలో పల్లెపండగ కార్యక్రమంలో మాట్లాడారు. ఉపాధి నిధులు రూ.2.30 లక్షలతో నిర్మించే పశువుల షెడ్లకు శంకుస్థాపన చేశారు.

సత్తెనపల్లిలో సమస్యలెన్నో..?

- న్యూస్‌టుడే, సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణాన్ని దీర్ఘకాలంగా కొన్ని సమస్యలు వేధిస్తున్నాయి. ప్రభుత్వం మారిన ప్రతిసారి అవి పరిష్కారం అవుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. డంపింగ్ యార్డు సమస్య కొన్నేళ్లుగా వెంటాడుతోంది. రోజూ 22 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. మాచర్ల రోడ్డులో హిందూ శ్మశానవాటిక పక్కనే డంపింగ్ యార్డు నిర్వహించడంతో అక్కడుండి వెలువడే పొగతో మూడు కాలనీల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయనే ఫిర్యాదులు వచ్చాయి. దీంతో అక్కడ చెత్త వేయడం నిలుపుదల చేశారు. రూ.లక్షలతో నిర్మించిన డంపింగ్ యార్డు నిరుపయోగంగా మారింది. పిడుగురాళ్ల రోడ్డులో ప్రైవేటు వ్యక్తికి చెందిన పొలంలో చెత్త పడేస్తున్నారు. శాశ్వత డంపింగ్ యార్డు ఏర్పాటుపై దృష్టి సారించాల్సి ఉంది.

ఇంటింటికీ కుళాయిలు ఏవీ?

నీటి వనరులున్నా పైపులైన్లు అన్ని ప్రాంతాలకు లేకపోవడంతో ఏడాదంతా కొన్ని కాలనీల్లో తాగునీటి సమస్య ఉంది. పట్టణంలో 107 ఎకరాల్లో సమగ్ర రక్షిత చెరువు ఉంది. ఒకసారి పూర్తిగా నీరు నింపితే ఆరు నెలల వరకు ఎటువంటి సమస్య ఉండదు. జల వనరులు పుష్కలంగా ఉన్నా ఇంటింటికీ కుళాయి లేకపోవడంతో ట్యాంకర్లతోనే సరఫరా చేస్తున్నారు. పట్టణంలో సుమారు 16 వేల కుళాయి



ఆక్రమణకు గురైన వరద కాలువ

లు ఉండగా.. సగం మందికి నీటి కనెక్షన్లు లేవు. ముస్లిం పేటలో ఏడాదంతా తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు.

వానొస్తే.. వణుకే

చిన్నపాటి వర్షం కురిసినా చిగురుటాకులా వణికిపోయే పరిస్థితి. అమరావతి మేజరు కాలువ నుంచి వడ్డవల్లి మీదుగా బసవమ్మ వాగు వరకు కాలువ ఆక్రమణలకు గురైంది. నాగన్నకుంట, యానాదికాలనీ, వెంకటపతినగర్, సుందరయ్యనగర్, కొత్తపేట వాసులు ముంపు నుంచి బయట పడేసే చర్యలు తీసుకోవాలి. ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ కాలువ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

సొంతింటి కల నెరవేరేనా?

సొంతగూడులేని కుటుంబాలు పట్టణంలో 6 వేలు ఉన్నాయని వివిధ సందర్భాల్లో ప్రభుత్వం నిర్వహించిన సర్వేల్లో వెల్లడైంది. నవరత్నాలు.. అందరికీ ఇళ్ల పథకం కింద కొన్ని కుటుంబాలకు నివేశన స్థలాల్లో అందజేసినా 70 శాతం అవి నివాసయోగ్యంలేని దుస్థితి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టింది. అందులో స్థల సముదాయంలో 640 ఇళ్లు నిర్మించేలా పనుల్ని చేపట్టింది. అందులో 160 ఇళ్లను పూర్తి చేయాలనే ఆలోచనను వైకాపా ప్రభుత్వం చేసినా.. ఐదేళ్లలో తేదిని లబ్ధిదారులకు అప్పగించలేదు. 640 ఇళ్లను పూర్తి చేస్తే, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల సాకారం చేయాలి.